
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
సోమవారం 20 మే 2024



సేద్యమెట్లా?

తొలకరి వర్షాలు మొదలయ్యాయి. రైతు మోములో సంతోషం కనిపిస్తోంది. నైరుతి కంటే ముందే జిల్లాలో వర్షాలు మొదలయ్యాయి. ఒక పక్క ఎండలు, ఎలక్షన్లతో ఇబ్బందులు పడిన రైతాంగం వర్షం రాకతో సేద్యం బాటపట్టింది. వర్షం పడిన మరుసటిరోజే పొలాల్లోకి వెళ్లారు. చేనును సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మరికొందరు వర్షం వచ్చిన ఆనందంలో పొలాలకెళ్లి వర్షం పదును చూసుకుని, వచ్చారు. ఇంటికి చేరిన రైతులు సేద్యానికి డబ్బు ఎట్లా అని అలోచనలో పడ్డారు. చేతిలో చిల్లిగవ్వ లేదు. ప్రభుత్వ సాయం అందలేదు. రైతు భరోసా ఇవ్వలేదు. ఇన్‌పుట్ సబ్సిడీ కొన్ని ప్రాంతాల రైతులకే వచ్చింది. జిల్లా అంతా నష్టపోతే కేవలం రెండు, మూడు మండలాలకే ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో సేద్యానికి డబ్బు ఎలా అని మదనపడుతున్నట్లు తెలిసింది. మరోపక్క విత్తనాలు, ఎరువులు, సేద్యపు ఖర్చులు పెరిగిపోయాయి. ప్రైవేటు అప్పులు పుట్టే పరిస్థితి కనిపించట్లేదు. ఎన్నికల నేపథ్యంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరే వరకు సాయం అందే అవకాశం లేదు. ఓవైపు పంట పెట్టడానికి డబ్బు కోసం ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు బ్యాంకుల్లో తెచ్చిన క్రాప్‌లోన్ల రెన్యువల్ సమస్యగా మారింది. కనీసం వడ్డీ కట్టాలన్నా ప్రతి రైతుకు రూ.10 వేలకుపైగా అవసరం. ఖరీఫ్‌కు ముందే వర్షాలు కురవడంతో ఆనందంగానే ఉన్నా.. పంట పెట్టడానికి డబ్బు ఎలా అని మదనపడుతున్నారు. -కదిరి

- వర్షం రాకతో ఖరీఫ్ పనులు మొదలు
- సేద్యానికి డబ్బు కోసం మదన పడుతున్న రైతులు
- ప్రభుత్వ సాయం.. శూన్యం..
- పెరిగిన విత్తనాలు, ఎరువుల ధరలు
- రుణాల రెన్యువల్‌తో ఆర్థిక ఇబ్బందులు


పొలాన్ని సిద్ధం చేసుకుంటున్న రైతులు

ఎకరాకు రూ.20 వేలు కావాలి..

ముందస్తు వర్షాలతో రైతులు పొలం పనులు మొదలెట్టారు. ఈసారైనా పంట వేసుకోవాలన్న ఆతృతతో ఉన్నారు. పొలాన్ని సిద్ధం చేసుకునే దగ్గరనుంచి విత్తనం వేసేవరకు పనులు పూర్తికావాలంటే కనీసం ఎకరాకు రూ.20వేలు అవసరం. ప్రస్తుతం రైతుల వద్ద చిల్లిగవ్వ లేదు. ఈ పరిస్థితుల్లో సేద్యానికి డబ్బెక్కడి నుంచి తేవాలని మదనపడుతున్నట్లు రైతులు అంటున్నారు. గంటకు ట్రాక్టర్ దుక్కి దున్నడానికి రూ.వెయ్యి నుంచి రూ.1200 అవుతోంది. రెండుమార్లు సేద్యం, విత్తడం తదితర పనులకు డబ్బు కావాలి. ఈ పనులన్నీ జూన్ మొదటివారానికల్లా పూర్తి చేయాల్సి ఉంది. నైరుతి రాష్ట్రంలోకి ప్రవేశించిన వెంటనే విత్తనం విత్తుకుంటే పంట దిగుబడులు ఆశాజనకంగా వస్తాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. సేద్యం పనులు చేయడానికి డబ్బు ఎక్కడా పుట్టడం లేదని వాపోతున్నారు.

ప్రభుత్వ సాయమేదీ?

సేద్యం పనులు, పంటలు పెట్టడానికి రైతులకు ప్రభుత్వం సాయం అందించాలి. జిల్లాలో ప్రధాన పంట వేరుశనగే. కదిరి డివిజన్‌లో ఖరీఫ్‌లో వేరుశనగ తప్ప.. మరో పంటపండదు. పంట సాగుకు చిన్న, సన్నకారు, పెద్ద రైతులు కూడా సిద్ధమవుతున్నారు. గతేడాది పంట చేతికిరాక అన్నదాతలు నష్టపోయారు. పెట్టుబడులు దక్కలేదు. దీంతో ప్రస్తుతం పంట సాగుకు ఎవరి వద్దా డబ్బు లేవు. ప్రస్తుతం సేద్యం పనులతోపాటు విత్తనకాయలు, ఎరువులు కొనాల్సిందే. రైతుల వద్ద డబ్బులేక ప్రభుత్వం వైపు చూస్తున్నారు ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో నూతన ప్రభుత్వం ఏర్పడితేగానీ, రైతులకు సాయం అందే పరిస్థితి లేదు. ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడనున్నాయి. తరువాత ప్రభుత్వం ఏర్పడి రైతులకు నిధులు విడుదల చేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడితే ప్రతి రైతుకు రూ.20వేలు అందుతాయన్న ఆశతో ఉన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ విడుద చేసినా, అది కొన్ని మండలాలకే వర్తించింది. ఎక్కువశాతం రైతులకు రాలేదు. దీంతో ప్రభుత్వ సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

పెరిగిన ధరలు



పెరిగిన విత్తనాలు, ఎరువుల ధరలు అన్నదాతలను భయపెడుతున్నాయి. సహజంగా లభించే సేంద్రీయ ఎరువు కరువైంది. రసాయన ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. విత్తనకాయల ధరలు రైతులకు అందనంత ఎత్తులో ఉన్నాయి. గతేడాది రూ.4,800కి సబ్సిడీతో 90 కేజీల మూడు బస్తాలు ప్రభుత్వం అందించింది. ఈసారి మాత్రం 90 కేజీలు రూ.5,220 సబ్సిడీతో అందించాలని నిర్ణయించారు. ప్రైవేటుగా కూడా విత్తనాలు కొనుగోలు చేయాల్సి ఉంది. వాటి ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులు విత్తనాలు, ఎరువుల సబ్సిడీ పెంచాలని కోరుతున్నారు.

భారంగా రెన్యువల్



పంటలు పెట్టడానికే రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో రుణాల రెన్యువల్ గుదిబండలా తయారైంది. ప్రతి రైతు హీనపక్షం వడ్డీ రూపంలో రూ.పదివేలకు పైగానే చెల్లించాలి. పెద్ద రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. రోజుకు రూ.వందకు మూడు రూపాయల వంతున వడ్డీకి ప్రైవేటువారి వద్ద అప్పులు తీసుకుని, రెన్యువల్ చేయించుకుంటున్నారు. ప్రభుత్వం చెప్పే పావలా, సున్నా వడ్డీలు రైతులకు వర్తించట్లేదు. దీంతో రెన్యువల్ రైతులకు భారంగా మారింది. పంటలు పెట్టడానికి, రెన్యువల్ చేయడానికి డబ్బులు లేక రైతులు విలవిల్లాడుతున్నారు.

చేతిలో చిల్లిగవ్వలేదు



నాకు ఐదెకకరాల పొలం ఉంది. పంటలు పెట్టాలంటే రూ.లక్షకుపైగా కావాలి. బ్యాంకులో పంట రుణాల రెన్యువల్‌కు మరో రూ.50వేలు అవసరం. ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వలేదు. ప్రభుత్వ సాయం అందలేదు. ఇన్‌పుట్ సబ్సిడీ రాలేదు. ప్రభుత్వం వెంటనే రైతులకు పంటలు సాగు చేసుకోవడానికి సాయం చేయాలి.

- రమణారెడ్డి, రైతు, కత్తివారి పల్లి, గాండ్లపెంట మండలం

సేద్యానికి డబ్బుల్లేవు



తొలకరి వర్షాలు కురవడం ఆనందంగా ఉంది. నాకున్న పొలంలో సేద్యం పనులు చేపట్టాల్సి ఉంది. చేతిలో డబ్బులేదు. రైతు భరోసా రాలేదు. సేద్యానికి రూ.50వేలకుపైగా ఉండాలి. ప్రభుత్వం సాయం అందిస్తే పంట పెట్టుకునే అవకాశం ఉంటుంది. లేదంటే ఇబ్బందులు పడాల్సిందే. బయట కూడా ఎక్కడా అప్పులు పుట్టట్లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైతే సాయం చేస్తుందేమోనని ఎదురు చూస్తున్నాం.

- నారాయణనాయుడు, నల్లగుట్లపల్లి, నంబులపూలకుంట మండలం









సబ్‌జైలు నిర్వహణపై
న్యాయాధికారి మండిపాటు


హిందూపురం సబ్‌జైలులో రికార్డులను పరిశీలిస్తున్న న్యాయాధికారి

హిందూపురం/పెనుకొండ, మే 19: హిందూపురం సబ్‌జైలు నిర్వహణపై జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఏడీజే కంపల్లె శైలజతో కలిసి జిల్లా న్యాయాధికారి ఆదివారం సబ్‌జైలును తనిఖీ చేశారు. ఖైదీలకు ఇవ్వాల్సిన గుర్తింపు కార్డులు, దస్త్రాల నిర్వహణలో నిర్లక్ష్యంపై సూపరింటెండెంట్ అంజినాయక్‌పై అసహనం వ్యక్తం చేశారు. ఖైదీల వివరాలు తెలుసుకున్నారు. వారికి ఇవ్వాల్సిన గుర్తింపు కార్డుల విషయంలో నిర్లక్ష్యంపై సంబంధిత హెడ్‌వార్డన్ రామాంజినాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. జైలు గదులు, ఆహారపదార్థాలు వండేందుకు సరఫరా చేస్తున్న నిత్యావసరాల నాణ్యతను పరిశీలించారు. ఖైదీలతో వారి కేసులపై ఆరాతీశారు. హెడ్‌వార్డన్ హరినాథ్ మద్యం సేవించి విధులకు వస్తున్నట్లు గుర్తించారు. అతడిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని సూపరింటెండెంట్‌ను న్యాయాధికారి మందలించారు. పనితీరు మార్చుకోకపోతే సస్పెన్షన్‌కు సిఫార్సు చేస్తానని హెచ్చరించారు. అనంతరం పెనుకొండ సబ్‌జైలును తనిఖీ చేశారు. కార్యక్రమంలో న్యాయాధికారులు బుజ్జప్ప, ముజీబ్ పసపలసయ్యద్, వివిధ కోర్టులకు చెందిన సూపరింటెండెంట్లు భాస్కర్, రామాంజనేయులు, రాధాకృష్ణ, లోక్ అదాలత్ హేమావతి పొల్గొన్నారు.

పలు మండలాల్లో వర్షం

పుట్టపర్తి రూరల్, మే 19: జిల్లావ్యాప్తంగా శనివారం పలుచోట్ల వర్షం కురిసింది. అత్యధికంగా రామగిరిలో 64.2 మి.మీ, అత్యల్పంగా తాడిమర్రిలో 2.2 మి.మీ, వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. అమరాపురం 39.8 మి.మీ, బుక్కపట్నం 38.4 మి.మీ, లేపాక్షి 32.8 మి.మీ, నల్లచెరువు 28.4 మి.మీ, బత్తలపల్లి 27.8 మి.మీ, సోమందేపల్లి 24.4 మి.మీ, గాండ్లపెంట 22.4 మి.మీ, పుట్టపర్తి 20.6 మి.మీ, కదిరి 18.2 మి.మీ, పరిగి 16.4 మి.మీ, పెనుకొండ14.8 మి.మీ, తనకల్లు 14.6 మి.మీ, తలుపుల 13.2 మి.మీ, రొళ్ళ 11.6 మి.మీ, చెన్నేకొత్తపల్లి 10.6 మి.మీ, చిలమత్తూరు 10.6 మి.మీ, రొద్దం 10.2 మి.మీ, కొత్తచెరువు 6.4 మి.మీ, హిందూపురం 6.4 మి.మీ, అమడగూరు 6.2 మి.మీ, కనగానిపల్లి 5.8 మి.మీ, గోరంట్ల 4.2 మి.మీ, తాడిమర్రిలో 2.2 మి.మీ అత్యల్ప వర్షపాతం నమోదైందని వెల్లడించారు.

అలరించిన సాయిమహిమ నాటిక


నాటికలోని సన్నివేశం

పుట్టపర్తి, మే 19: సత్యసాయి యువ బృందం ప్రదర్శించిన సాయిమహిమ నాటిక భక్తులను అలరింపజేసింది. చెన్నైకి చెందిన భక్తులు రెండోరోజు ఆదివారం సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మొదట విద్యార్థులు వేదపఠనం చేశారు. యువత సత్యసాయి ప్రేమతత్వం, ఆధ్యాత్మిక బోధనలపై నాటిక ప్రదర్శించారు. చెన్నైలో చేపట్టిన సేవల గురించి చెన్నై సేవాసంస్థల అధ్యక్షుడు రమష్ వివరించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

వైభవంగా శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవం


పెళ్లి పీటలపై కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

కదిరి, మే 19: పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆర్జిత కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. శ్రీవారితో పాటు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను కల్యాణమండలంలో కొలువుదీర్చారు. పట్టు వస్త్రాలు, సుగంధద్రవ్యాలు, కదిరి మల్లెలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మంగళవాయిదాలు, మంత్రోచ్చరణల నడుమ శ్రీవారి కల్యాణం కన్నులపండుగా సాగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.
















కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ, కమిషనర్

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన

అనంతపురం టౌన్, మే 19: స్థానిక జేఎన్‌టీయూలో ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లను జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్, నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్ ఆదివారం పరిశీలించారు. ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల కౌంటింగ్ చేపట్టే గదుల్లో ఏర్పాట్లనూ పరిశీలించారు. వారి వెంట ఆర్‌ఓలు రాణిసుష్మిత, వెన్నెల శ్రీను, నోడల్ అధికారులు ఓబులరెడ్డి, సురేంద్ర, వీర్రాజు, రూప్లానాయక్ ఉన్నారు.

ప్రశాంతంగా ఆర్డీటీ సెట్

● 3,868 మంది హాజరు..




పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అనంతపురం క్లాక్‌టవర్, మే 19: ఆర్డీటీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పదవ తరగతి 2023-24 విద్యాసంవత్సరంలో ఉత్త మ మార్కులు సాధించిన విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి నిర్వహించే ఆర్డీటీ ప్రవేశ పరీక్ష ఆదివారం కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాల పరిధిలో ఎంపిక చేసిన 11 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించారు. 100మార్కులకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.10గంటల వరకు నిర్వహించారు. ఈ ఏడాదికి సంబంధించి 360సీట్లకు గాను 3,928మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3,868మంది విద్యార్థులు హాజరయ్యారు. 60మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, ఆర్డీటీ డైరెక్టర్లు నిర్మల్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, నిరంజన్, సాయి కృష్ణ, కృష్ణవేణి, శీబా, మోహన్‌మురళీ, లక్ష్మణరావు డైరెక్టర్ మోహన్‌మురళీ పాల్గొన్నారు. వారం రోజుల్లో ఫలితాలు విడుదల చేయనున్నారు.

ఈతకెళ్లి బాలుడి మృతి

బుక్కరాయసముద్రం, మే 19: స్థానిక చిక్కవడియార్ చెరువులోకి ఈతకెళ్లి బాలుడు ఇమామ్‌బాషా (12) నీటి గుంతలో పడి ఆదివారం మరణించాడు. మండల కేంద్రంలోని ఇస్లాంపూర్ కాలనీకి చెందిన రజాక్‌వలి, అరుణ కుమారుడు ఇమామ్‌బాషా ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో స్నేహితులతో కలిసి సిద్దరాంపురం రోడ్డు వైపు బీకేఎస్ చెరువులోకి ఈతకు వెళ్లారు. లోతు తక్కువ ఉన్నచోట నీటిలో మొదట దిగాడు. ముందువైపు లోతు ఉన్న విషయం గ్రహించలేక అటు వైపు వెళ్లాడు. లోతైన నీటి గుంతలోకి వెళ్లిన ఆ బాలుడు ఈత రాక మునిగిపోయాడు. స్నేహితులు వెంటనే బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకున్నారు. గంటపాటు గాలించగా.. ఇమామ్‌బాషా మృతదేహం లభ్యమైంది. కేసు దర్యాప్తులో ఉంది.





ఉత్తుత్తి బటన్!

● నేటికీ అందని విద్యాదీవెన సొమ్ము ● ఫీజు కోసం కాలేజీ యాజమాన్యాల ఒత్తిడి ● డబ్బుకట్టి హాల్ టిక్కెట్ తీసుకున్న విద్యార్థులు ● ప్రభుత్వ తీరుపై విద్యార్థులు, తల్లిదండ్రుల ఆగ్రహం

ముఖ్యమంత్రి బటన్ నొక్కి దాదాపు మూడు నెలలు కావస్తున్నా జగనన్న విద్యాదీవెన సొమ్ము అందక పలువురు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది మార్చి 1న సీఎం జగన్మోహన్‌రెడ్డి కృష్ణాజిల్లా పామర్రులో జగనన్న విద్యాదీవెన సొమ్ము విడుదలకు బటన్ నొక్కారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో రెండు వేల మంది విద్యార్థులకు మాత్రమే ఆ పథకం లబ్ధి అందినట్లు అధికారవర్గాల సమాచారం. మిగిలిన విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాల నుంచి ఫీజు ఒత్తిళ్లు అధికమయ్యాయి. పరీక్షల సమయంలో ఫీజు కడితేనే హాల్ టిక్కెట్లు ఇస్తామని కాలేజీ యాజమాన్యాలు తెగేసి చెప్పిన సందర్భాలు ఉన్నాయి. విద్యాదీవెన సొమ్ము వస్తుందనే నమ్మకంతో చదివిస్తున్న తమకు ఇలా మోసం చేస్తే ఎలా అని విద్యార్థులు వారి తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

అనంతపురం ప్రెస్‌క్లబ్

రెండు వేల మందికే..?

జగనన్న విద్యాదీవెనకు సంబంధించి జిల్లాలో ఇంతవరకు రెండువేల మందికి మాత్రమే నగదు జమైనట్లు అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో 200 మందికి కూడా విద్యాదీవెన సొమ్ము జమ కానట్లు పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. పథకాలకు సంబంధించిన నగదు ఇవ్వకుండా మోసం చేశారంటూ ప్రజల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం మూడ్రోజుల కిందట బటన్ నొక్కిన పథకాలకు సంబంధించి నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. అందులో భాగం గా రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న విద్యాదీవెనకు రూ. 200 కోట్లు విడుదల చేశామని.. ఒకటి రెం డ్రోజుల్లో ఖాతాలకు జమవుతాయని ప్రకటించింది. మూడ్రోజులు గడిచినా ఇంత వరకూ ఒక్క విద్యార్థి తల్లి ఖాతాకు కూడా నగదు జమకాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మార్చి 1న బటన్ నొక్కినా...

ఈ ఏడాది జగనన్న విద్యాదీవెన లబ్ధికి సంబంధించి సీఎం జగన్మోహన్‌రెడ్డి మార్చి 1న బటన్ నొక్కినప్పటికీ ఇంత వరకూ అధిక శాతం మంది విద్యార్థులకు నగదు జమ కాలేదు. జిల్లాకు సంబంధించి 40006 మంది విద్యార్థులకు గానూ రూ.29.08 కోట్లు విడుదల చేస్తున్న ట్లు అధికార వర్గాలు ప్రకటించాయి. ఎస్సీ విద్యార్థులు 7,104 మందికి రూ. 4.69 కోట్లు, 1635 మంది ఎస్టీ విద్యార్థులకు రూ. 1.15 కోట్లు, 19968 మంది బీసీ విద్యార్థులకు రూ. 13.94 కోట్లు, 2298 మంది కాపు విద్యార్థులకు రూ. 1.84 కోట్లు, 4987 మంది ఈబీసీ విద్యార్థులకు రూ.4.69 కోట్లు, 3907 మంది ముస్లిం మైనార్టీ విద్యార్థులకు రూ.2.70 కోట్లు, 107 క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులకు రూ.ఏడు లక్షలు చొప్పున విద్యార్థుల తల్లుల ఖాతాలకు నగదు జమవుతుందని అధికారులు లెక్కలు చూపారు. అయితే మార్చి నెల 20 లోపు కొంత మంది విద్యార్థులకు నగదు జమైనట్లు సమాచారం. ఆ తరువాత ఒక్క విద్యార్థికి కూడా నగదు జమకాకపోవడం గమనార్హం.

కోతలతోనే నగదు విడుదల..

జగనన్న విద్యాదీవెన ఆర్భాటంగా ప్రవేశపెట్టినప్పటికీ ఆ పథకం ఐదేళ్లల్లో ఎవరికి సక్రమంగా అందలేదన్న విమర్శలు ఉన్నాయి. ఒకరికి ఒక సంవత్సరం ఇస్తే... రెండు సంవత్సరాలు ఎగ్గొట్టడం లేదా ఒక సంవత్సరంలో ఒక విడత ఇవ్వడం... రెండో విడత ఇవ్వకపోవడం ఇలా కోతలతోనే విద్యాదీవెనను అమలు చేశారన్న విమర్శలు విద్యార్థి వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఏదో ఒక బూచి చూపడం, లేదా సాంకేతిక సమస్యలతో దాదాపు సంవత్సరం, రెండేళ్ల పాటు పలువురు విద్యార్థులకు విద్యాదీవెన సొమ్ము అందకుండా చేసిందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా విద్యాదీవెనను నమ్ముకున్న విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాల నుంచి ఒత్తిళ్లు తప్పడం లేదు. కొంతమంది విద్యార్థులు విద్యాదీవెన అందకపోవడంతో సొంత డబ్బు చెల్లించారు.

డబ్బు కట్టి హాల్ టిక్కెట్ తీసుకున్నా : మంజునాథ్ గౌడ్, డిగ్రీ ఫైనలియర్



మార్చి 1న జగనన్న విద్యాదీవెన డబ్బులు పడతాయని చూశాం. పడలేదు. వారం తరువాత సచివాలయానికి వెళ్లి ఆరా తీశాం. పడుతాయన్నారు. ఎగ్జామ్స్ దగ్గరపడుతుండటంతో కాలేజీలో హాల్ టిక్కెట్లు ఇస్తున్నారు. నేను వెళ్లి అడిగితే డబ్బులు కడితేనే హాల్ టిక్కెట్ ఇస్తామని చెప్పారు. మా పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఏం చేస్తాం మా అమ్మవాళ్లు ఏం చేశారో ఏమో తెలీదు గానీ డబ్బులు కట్టారు. అప్పుడు నాకు హాల్ టికెట్ ఇచ్చారు. కాలేజీ ముగిసే సమయంలో మమ్మల్ని చాలా ఇబ్బంది పెట్టారు.

రెండేళ్లుగా సొమ్మే పడలేదు: ఆనంద్, డిగ్రీ సెకెండియర్



జగనన్న విద్యాదీవెనకు డిగ్రీ ఫస్టియర్ నుంచి అప్లై చేస్తూ వచ్చా. ఓసారేమో సర్టిఫికెట్లు, అడ్రస్‌లు సరిగ్గాలేవని చెప్పారు. ఎన్ని సార్లు చేసినా డబ్బులు పడలేదు. అలా సంవత్సరమంతా నాకు డబ్బులు రాలేదు. సెకెండియర్‌లో అప్లై చేద్దామని వెళ్తే ఏవో టెక్నికల్ ఇష్యూస్ అని చెప్పి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పోయిన సంవత్సరం అప్లై చేస్తే అన్ని కరెక్టుగా ఉన్నాయన్నారు. లాస్టులోనైనా వస్తుందనుకుంటే... ఇంత వరకూ డబ్బులు పడలేదు. జగనన్న విద్యాదీవెన అంతా మోసం.

ఒక సంవత్సరం పడ్డాయంతే: సాయిస్వరూప



జగనన్న విద్యాదీవెన డబ్బులు నాకు ఫస్టియర్‌లో మాత్రమే వచ్చాయి. తరువాత రెండో సంవత్సరం రాలేదు. ఏమని అడిగితే అన్ని కరెక్టుగా ఉన్నాయి. క్లియర్ అవుతాయని రెండో సంవత్సరం గడిపేశారు. ఇక మూడో సంవత్సరమైనా వస్తాయనుకుంటే పోయిన సంవత్సరం డిసెంబరులో రాలేదు. ఈ సంవత్సరం మార్చి 1న వస్తాయనుకుంటే ఇంత వరకూ రాలేదు. మాలాంటి పేదోళ్లతో ఇలా ఆడుకుంటే ఎలా..? ఇస్తామంటే ఇస్తామని చెప్పాలి. లేదంటే లేదని చెప్పాలి. అంతేగానీ ఇలా మోసం చేయడం ఏమీ బాగోలేదు.

మారిన పది సిలబస్...!

● 2024-25 విద్యా సంవత్సరానికి టెన్త్‌కు కొత్త సిలబస్
● ఉమ్మడి జిల్లాకు చేరుకున్న కొత్త పాఠ్యపుస్తకాలు
● ప్రింటర్స్ నుంచి నేరుగా జిల్లాలోని గోడౌన్‌కు..
● 1 నుంచి 7 తరగతుల పుస్తకాలే చేరిక
● 8, 9,10 పుస్తకాలు నేరుగా మండలాలకే..
● జిల్లాలో 51 స్కూళ్లలో సీబీఎస్ఈ గుర్తింపు



జిల్లాకు చేరిన పుస్తకాలను దించుకుంటున్న గోడౌన్ అధికారులు

అనంతపురం విద్య, మే 19: రానున్న విద్యాసంవత్సరానికి పదవ తరగతి సిలబస్ మారింది. కొత్త పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. 2024-25 విద్యాఏడాదికి సంబంధించిన అన్ని తరగతుల పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరుతున్నాయి. ఈఏడాది 10వ తరగతి విద్యార్థులు మాత్రం మారిన సిలబస్ పుస్తకాలను చదవాల్సి ఉంటుంది. సీబీఎస్ఈ పాఠ్యపుస్తకాలను 10వ తరగతి విద్యార్థులకు అందించనున్నారు. ఇప్పటికే ముద్రణాలయాల నుంచి జిల్లాలకు చేరుతున్నాయి. గతంలో ప్రింటర్స్ నుంచి అన్ని క్లాసుల పుస్తకాలు జిల్లా కేంద్రంలోని బుక్స్ గోడౌన్లకు పాఠ్యపుస్తకాలు సప్లై చేయగా...గోడౌన్ నుంచి మండల పాయింట్లకు సప్లై చేసేవారు. అయితే ఈ ఏడాది 1వ తరగతి నుంచి 7వ తరగతి పాఠ్యపుస్తకాలు జిల్లా కేంద్రంలోని గోడౌన్లకు సప్లై చేస్తుండగా, 8,9,10వ తరగతి పాఠ్యపుస్తకాలను డైరెక్టుగా మండల కేంద్రాలకు సప్లై చేస్తున్నారు.

1 నుంచి 7 వరకు 16,07,743 లక్షల ఇండెంట్...

అనంతపురం, సత్యసాయి రెండు జిల్లాలకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను ప్రింటర్స్ నుంచి అనంతపురం జిల్లా కేంద్రానికే పంపుతున్నారని అధికార వర్గాలు చెబుతున్నాయి. అనంతపురం జిల్లా నుంచి 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకూ 9,59,226 పుస్తకాల కోసం, సత్యసాయి జిల్లా నుంచి 6,48,517 పుస్తకాల కోసం ఇండెంట్ పంపారు. అయితే అనంతపురం జిల్లాకు ఇప్పటి వరకూ 4,75,020 పుస్తకాలు జిల్లాకు చేరినట్లు అధికారులు చెబుతున్నారు. సత్యసాయిజిల్లాకు చెందిన పుస్తకాలు సైతం 4,49,125 పుస్తకాలు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 16.07 లక్షల పుస్తకాలకు ఇండెంట్ పెట్టగా...ఇప్పటి వరకూ 9.24 లక్షల పుస్తకాలు జిల్లాకు చేరినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రింటర్ల నుంచి జిల్లా కేంద్రంలోని గోడౌన్లకు చేరిన 1వ తరగతి నుంచి 7వ తరగతి పుస్తకాలను మండలాలకు పంపుతున్నారు.

జిల్లాకు చేరిన కొత్త పుస్తకాలు

హై స్కూల్‌లోని 8,9,10 క్లాసుల పుస్తకాలను ప్రింటర్ల నుంచి మండలాలకే నేరుగా సప్లై చేస్తున్నారు. మండలాలకు చేరిన పుస్తకాలను మళ్లీ స్కూళ్లకు పంపనున్నారు. అయితే ఈ ఏడాది 10వ తరగతి సిలబస్‌ను మార్చారు. 2024-25 విద్యాసంవత్సరంలో జాతీయ విద్యాపరిశోధన,శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) సీబీఎస్ ఈ సిలబస్‌తో పాఠ్యపుస్తకాలను ముద్రించారు. ఈ విద్యాసంవత్సరం టెన్త్ విద్యార్థులు మారిన సిలబస్ పుస్తకాలను చదవి పరీక్షలు రాయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1000 స్కూళ్లకు సీబీఎస్ఈ గుర్తింపు వచ్చింది. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 51 స్కూళ్లకు గుర్తింపు ఇచ్చినట్లు విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ఇందులో కళ్యాణదుర్గంలోని కెసి హైస్కూల్‌తోపాటు, 11 మోడల్ స్కూళ్లు, 11 రెసిడెన్షియల్ స్కూళ్లు, 28 కేజీబీవీలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. సీబీఎస్ఈ గుర్తింపు ఉన్న స్కూల్ విద్యార్థులు, రాష్ట్ర గుర్తింపు ఉన్న హై స్కూల్ విద్యార్థులు రాసే పరీక్షల్లో తేడా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానాల వల్ల అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థుల్లో కొంత గందరగోళం నెలకొంది.



జిల్లా కేంద్రం లోని గోడౌన్

హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపొద్దు

\- డాక్టర్ అనుపమ జేమ్స్



వైద్యాధికారులు, సిబ్బంది ర్యాలీ

అనంతపురం టౌన్, మే19: హెచ్‌ఐవీ బాధితులపట్ల వివక్ష చూపరాదని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనుపమ జేమ్స్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్‌లైట్ మెమోరియల్ డేను పురస్కరించుకుని ఆదివారం అనంతపురంలో వైద్యశాఖ క్యాండిల్ లైట్ ర్యాలీని నిర్వహించింది. డాక్టర్ అనుపమ జేమ్స్ ఈ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ సప్తగిరి సర్కిల్ వరకు సాగింది. ఈసందర్భంగా డాక్టర్ అనుపమజేమ్స్ మాట్లాడుతూ ఎయిడ్స్‌తో మరణించిన వారికి సంఘీభావం తెలుపుతూ, ఎయిడ్స్‌నివారణకు అందుబాటులో ఉన్న వైద్యసేవలపై అవగాహన కల్పించడానికి ఏటా ఈ క్యాండిల్ లైట్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారిపట్ల ఎవరైనా వివక్ష చూపితే చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ డీపీఎం వెంకటరత్నం, సూపర్‌వైజర్ జీవీ రమణ, పీఎంఓ నాగన్న, హెచ్‌ఈఓ సత్యనారాయణ, అనంత నెట్‌వర్క్ రామాంజనేయులు, ఈశ్వరయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఘర్షణలో మాజీ వలంటీర్ మృతి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాజీజాన్‌సైదా



నిర్జీవంగా పడివున్న అనిల్‌కుమార్

గోరంట్ల, మే 19: మండలంలోని కొత్తబయ్యన్నపల్లి వద్ద జరిగిన ఘర్షణలో మల్లాపల్లి మాజీ వలంటీర్ గొల్ల అనిల్‌కుమార్ (24) ఆదివారం మృతి చెందినట్లు పెనుకొండ డీఎస్పీ బాజీజాన్‌సైదా తెలిపారు. మల్లాపల్లి వలంటీర్‌గా రాజీనామా చేసిన గొల్ల అనిల్ కుమార్ అదే గ్రామానికి చెందిన నరసింహమూర్తి, వెంకటనరేష్‌లతో కలిసి ద్విచక్రవాహనంపై కర్నాటకలోని పెనలపర్తికి మద్యం సేవించడానికి వెళ్లాడు. ఈప్రాంతం మద్యంప్రియులు పెనలపర్తికెళ్లి మద్యం తాగి రావడం పరిపాటి. ఈక్రమంలోనే కొత్తచెరువు ప్రాంతానికి చెందిన కొంతమంది కారులో వెళ్లి మద్యం సేవించి, పెనలపర్తి నుంచి తిరిగి సొంతూరికి బయల్దేరారు. అనిల్‌కుమార్ ద్విచక్రవాహనంపై ఒక్కడే ముందుగా బయల్దేరగా, మిగిలిన ఇద్దరు వెనుక ఆలస్యంగా వస్తున్నారు. మార్గమధ్యలో కారులో వెళ్తున్నవారు అనిల్‌కుమార్‌ల మధ్య ఘర్షణ జరిగింది. అనిల్‌కుమార్‌ను కొట్టడంతో రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక వస్తున్న ఇద్దరు మిత్రులు అక్కడికి చేరుకోగా, కొత్తచెరువు ప్రాంత వాసులు కారు వదిలి పారిపోయినట్లు డీఎస్పీ తెలిపారు. పోలీసులు కారును స్వాధీనం చేసుకుని, మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పెనుకొండకు తరలించారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. అయితే ఘర్షణ వెనుక భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. మద్యం తాగే సమయంలో రాజకీయాల గురించి జరిగిన వాదన ఘర్షణకు దారి తీసిందంటున్నారు. అలాగే మృతుడు కారును మార్గ మధ్యలో ఆపి, మద్యం అడిగాడని, వారు ఇవ్వకపోవడంతో గొడవ పడినట్లు కూడా వినిపిస్తున్నాయి. కారుకు దారి వదలకపోవడంతో వారు మృతుడితో ఘర్షణ పడినట్లు మరో వాదన వినిపిస్తోంది. వీటిపై డీఎస్పీ మాట్లాడుతూ ఇందులో రాజకీయ ప్రమేయం లేదని, కారులో ఉన్న వారందరూ నేరప్రవృత్తి కలిగినవారేనని పేర్కొన్నారు. కారులో ఆరుగురు ప్రయాణిస్తున్నారని, వారిలో ఇద్దరిని పోలీసుల అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. పోలీసులు ఈవిషయం ధ్రువీకరించడంలేదు. త్వరలో నిందితులను పట్టుకుంటామని డీఎస్పీ పేర్కొన్నారు.

సిట్‌ను కలిసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు

తాడిపత్రిటౌన్, మే19: పట్టణంలో హింసపై విచారణకు వచ్చిన సిట్ బృందాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ ఆదివారం కలిశారు. స్థానిక రూరల్ పోలీసు స్టేషన్‌లో ఉన్న సిట్ బృందాన్ని ఆయన కలిసి, దాడిపై విచారణ వేగవంతం చేసి నిందితులను అరెస్టు చేయాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసంలో ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ దాసరి కిరణ్‌పై విచక్షణారహితంగా డీఎస్పీ చైతన్య దాడి చేయడంపై సభ్యులకు వివరించారు. ఆయన వెంట లీగల్ సెల్ నాయకులు తిరుపతినాయుడు, ఆదెన్న ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు: డీఐజీ



మాట్లాడుతున్న డీఐజీ షిమోషీ

తాడిపత్రిటౌన్, మే19: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామని అనంతపురం డీఐజీ షిమోషీ హెచ్చరించారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఎస్పీ గౌతమిశాలితో కలిసి డీఐజీ మాట్లాడారు. తాడిపత్రిలో రాళ్లదాడులకు సంబంధించి ఇప్పటికే 93 మందిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపామన్నారు. మరింత మందిని గుర్తించే పనిలో నిమగ్నమైనట్లు తెలిపారు. దాడుల్లో ప్రమేయం ఉన్నవారెవరినీ విడిచిపెట్టమని హెచ్చరించారు. జూన్ 4న కౌంటింగ్ సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తాడిపత్రిలో దాడులు, ప్రతిదాడులను దృష్టిలో పెట్టుకుని, సీఆర్పీఎఫ్, ఇండియన్ ఆర్మీ, ర్యాపిడ్, కేంద్ర బలగాలను పెద్దఎత్తున ఇప్పటికే రప్పించామన్నారు. కౌంటింగ్‌కు ముందురోజు మరిన్ని బలగాలను తెప్పించనున్నట్లు తెలిపారు. కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని, రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్స్‌ను ముందుగానే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. పట్టణంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయనీ, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని డీఐజీ వెల్లడించారు.

తాడిపత్రి ఘటనలో 575 మందిపై కేసులు?

పట్టణంలో తలెత్తిన ఘర్షణకు సంబం ధించి ఇరువర్గాలకు చెందిన 575 మందిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. సిట్ సభ్యులు.. వీరిపై కూడా సిబ్బందిని ఆరాతీసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే వీరిలో దాదాపు 100 మందిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారని తెలిసింది. మిగిలిన వారిని అరెస్టు చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారని అత్యంత విశ్వసనీయ సమాచారం.

22న నరసింహస్వామి జయంత్యుత్సవాలు

తాడిమర్రి, మే 19: మండలంలోని నారసింపల్లి గ్రామంలో ఈనెల 22వ తేదీ బుధవారం లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవాలను నిర్వహించనున్నామని, భక్తులు జయప్రదం చేయాలని గ్రామస్థులు ఆదివారం ప్రకటనలో కోరారు. 22న ఉదయం 6గంటలకు స్వామివారికి అభిషేకం, అలంకరణలు, పూజలు ఉంటాయన్నారు. 7:20కు హోమం, 8:30 కు కల్యాణం, 11గంటల నుంచి అన్నదానం జరుగుతాయన్నారు. తర్వాత సాయంత్రం 3:30 గంటల నుంచి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

23న పౌర్ణమి వేడుకలు

ధర్మవరం, మే 19: పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో ఉన్న భగవాన్ రమణమహర్షి ఆశ్రమంలో ఈ నెల 23వ తేదీ గురువారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు చిప్పలవెంకప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశ్రమంలో 11గంటలకు అరుణాచల మహాదీపాన్ని గోవు నెయ్యితో వెలిగిస్తామన్నారు. అనంతరం అక్షరమణమాల పారాయణం చేస్తామన్నారు. ఇంకా పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 1గంటకు భక్తులకు అన్నదానం చేయనున్నట్లు చెప్పారు.

భృంగివాహనంపై ఊరేగిన సంగమేశ్వరుడు

కొత్తచెరువు, మే 19: మండలకేంద్రంలో సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వాహకులు స్వామి వారిని భృంగివాహనంపై గ్రామ పురవీధులలో ఊరేగించారు. ముందుగా ఎడ్లబండిపై భృంగి వాహనాన్ని ఏర్పాటుచేసి పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు స్వామివారిని పెద్దఎత్తున దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తలు మనోహర్, నటరాజ్, ఫణి, నాగరాజ్, అర్చకుడు సాయి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో పెద్దమ్మతల్లి

ముదిగుబ్బ,మే19: మండల కేంద్రంలోని పాతవూరిలో వెలసిన గ్రామదేవత పెద్దమ్మతల్లికి ఆదివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. వేకువజామునే పూజారి కొండన అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, వేపమండలు, వెండి ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు పొందారు. మహిళలు అమ్మవారికి గాజులు, చీరలు, వడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేటి నుంచి విత్తన వేరుశనగకు పేర్ల నమోదు

ఓబుళదేవరచెరువు, మే 19: మండలవ్యాప్తంగా సోమవారం నుంచి సబ్సిడీ విత్తన వేరుశనగకు నమోదు ప్రక్రియను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు ఏఓ ఇలియాజ్ అమ్మద్ తెలిపారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌లో సాగు చేయడానికి గాను ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తన కాయల కోసం రైతులు పేర్లను ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకున్న వారికే విత్తనకాయలు అందిస్తామన్నారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకంతో పాటు ఆధార్, ఫోన్ తప్పకుండా తీసుకురావాలని సూచించారు. భూమి విస్తీర్ణాన్ని బట్టి విత్తన కాయలు అందిస్తామన్నారు. ఎకరాపైన ఉన్న వారికి 30 కేజీలు గల బస్తాను మూడు బస్తాలు అందిస్తామన్నారు. అరెకరా నుంచి ఎకరాలోపు ఉన్న వారికి రెండు బస్తాలు, అర ఎకరా ఉన్నవారికి ఒక బస్తా అందించనున్నట్లు ఏఓ వెల్లడించారు.

పోలీసులకు సహకరించాలి

తాడిమర్రి, మే 19: దుకాణదారులు, హోటళ్ల యజమానులు, కేఫ్ నిర్వాహకులు పోలీసులకు సహకరిస్తే ఎలాంటి సమస్యలు రాకుండా ఎన్నికలు సజావుగా పూర్తి చేసిన వారమవుతామని ముదిగుబ్బ రూరల్ సీఐ కృష్ణంరాజునాయక్ అన్నారు. తాడిమర్రిలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక దుకాణదారులు, హోటళ్ల యజమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏ చిన్న సమస్య తలెత్తిన పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అదేవిధంగా ఎక్కడైనా ఎవరైనా గొడవలు పడినా ఆ విషయాన్ని కూడా తెలియజేయాలన్నారు. చెప్పిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఓట్ల లెక్కింపు రోజున దుకాణాలన్నీ మూసివేయాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ నాగాస్వామి, ఏఎస్ఐ వన్నప్ప, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుష్పమండపంపై ఊరేగిన లక్ష్మీచెన్నకేశవుడు

ధర్మవరం, మే 19: చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల ఐదోరోజు ఆదివారం స్వామివారు పుష్పమండపంపై విహరించారు. శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహాలను ఉదయం ప్రత్యేకంగా అలంకరించి, పుష్పమండపంపై కొలువుదీర్చారు. పట్టణ వీధుల్లో ఊరేగించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో స్వామివారి కల్యాణోత్సవాన్ని నయనమనోహరంగా నిర్వహించారు. అన్నమయ్య సేవామండలి ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. సోమవారం ఉదయం శేషవాహనం, సాయంత్రం గజవాహనాలపై చెన్నకేశవుడు విహరించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.



అలంకరణలో భూదేవి, శ్రీదేవి సమేత చెన్నకేశవ స్వామి



చెన్నకేశవుడి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



హాజరైన భక్తులు

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

- వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో వర్ధంతి

ధర్మవరం, మే19: స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు ఉద్యమకారుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పట్టణంలోని సాయికృప జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం, సీపీఐ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిస్టు పార్టీ స్థాపించినప్పటి నుంచి పేదల కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టారన్నారు. దేశ తొలిప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు ప్రతిపక్షనేతగా ఉండి ప్ర జల సమస్యల పరిష్కరించడానికి ఎంతో కృషిచేశారన్నారు. సంపన్న కుటుంబంలో, అగ్రకులంలో జన్మించిన ఆయన బడుగుబలహీన వర్గాల కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. పేదల కోసం తన భూములను కూడా పంచిపెట్టారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్‌బాషా, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగుమధు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, సీపీఐ పట్టణకార్యదర్శి రమణ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సరస్వతి, చంద్రకళ, నాయకులు, మున్సిపాలిటీ, పారిశుధ్య కార్మిక సంఘంనాయకులు తదితరులు పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బడా సుబ్బిరెడ్డి, జీఎల్ నరసింహులు, జగన్మోహన్, బాబ్‌జాన్, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలో సీపీఎం, సీఐటీయూ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని జరిపారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, శ్రీరాములు, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

తనకల్లు: మండలకేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీఐటీయూ, సీపీఎం నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శివన్న, వేమన్న తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలకేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పలు పార్టీల నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బుట్టి నాగ భూషణనాయుడు, మంజునాథ్‌రెడ్డి, హనుమంతరెడ్డి, నాగేంద్ర తదితరులు ఉన్నారు.

ముదిగుబ్బ: మండలకేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీఐటీయు నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు బండల వెంకటేష్, పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లుగా.. మూలకు

- నిరుపయోగంగా చెత్త తరలింపు ట్రైసైకిళ్లు
- తుప్పు పడుతున్నా పట్టించుకోని పంచాయతీ అధికారులు

కొత్తచెరువు, మే 19: కొత్తచెరువు మేజర్ గ్రామ పంచాయతీలో చెత్తను తరలించే ట్రైసైకిళ్లు మూలన పడి తుప్పు పడుతున్నాయి. మూడేళ్ల క్రితం ప్రభుత్వం పంచాయతీలోని వార్డులలో చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించేందుకు వీటిని పంచాయతీ కార్మికులకు అందజేసింది. అయితే వైసీపీ ప్రభుత్వం చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురాలేదు. దీంతో ట్రైసైకిళ్లను వినియోగించుకోకుండా పంచాయతీ అధికారులు మార్కెట్‌లోని ఒక మూలన పడేశారు. దీంతో అవి ఎండ కు ఎండి, వానకు తడిసి తప్పు పడుతున్నాయి. వాటిని చూసి కూడా అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లక్షలు విలువ చేసే ట్రైసైకిళ్ల ఇలా తుప్పపడుతుంటే పంచాయతీ అధికారులు, పాలకులు పట్టించుకోరా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా వాటిని వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.



నిరుపయోగంగా ట్రైసైకిళ్లు

చౌటకుంటపల్లిలో తాగునీటి ఎద్దడి

- ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

నల్లమాడ, మే 19: మండలంలోని చౌటకుంటపల్లిలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత మూడు నెలల నుంచి తాగునీటి తీవ్రంగా నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. ఉన్న రెండు పంచాయతీ బోర్లలో భగర్భ జలాలు అడుగంటాయని, దీంతో సమస్య నెలకొందని అంటున్నారు. మొన్నటి దాకా ఒక బోరులో మాత్రం అరకొరగా వచ్చేవని, ఆ నీటితో పశువుల నీటి తొట్టిని నింపేవారని, చేసేది లేక తాము అక్కడనుంచి నీటిని తెచ్చుకునేవారమని చెబుతున్నారు. ప్రస్తుతం ఆబోరులోంచి కూడా నీరు రాలేదన్నారు. దీంతో గుక్కెడు నీరు దొరక్క విలవిల్లాడుతున్నామంటున్నారు. గ్రామంలోని స్థానక నాయకులు కొద్ది రోజులుగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారని, అయితే అవి ఎక్కడా చాలడం లేదని వాపోతున్నారు. గ్రామంలో సత్యసాయి నీటి కొళాయిలు ఉన్నాయని, సత్యసాయి తాగునీటిని గ్రామానికి సరఫరా చేసినా కొంతవరకు సమస్య తీరుతుందని పేర్కొంటున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి గ్రామంలో నెలకున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.



ట్యాంకర్ వద్ద నీటిని పటుకునేందుకు గుడికూడిన గ్రామస్థులు

బెంబేలెత్తిస్తున్న వీధికుక్కలు

- రోడ్లపై గుంపులుగా సంచారం
- ఒంటరిగా వెళ్లేవారు, మూగజీవాలపై దాడులు
- భయాందోళనలో ప్రజలు



గాండ్లపెంట ప్రధాన వీధిలో సంచరిస్తున్న కుక్కలు



ఇటీవల గొల్లపల్లిలో కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెలు



ఎల్లుగుట్టపల్లిలో గాయపడిన చిన్నారి (ఫైల్)

గాండ్లపెంట, మే 19: మండలవ్యాప్తంగా వీధి కుక్కల బెడద అధికమైంది. వాటి దాడులకు మండల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఒంటరిగా వెళ్లే వారు, చిన్నారులు, మహిళలతో పాటు మూగజీవాలపై కూడా అవి నిత్యం ఏదో ఒకచోట దాడులు చేస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా గాండ్లపెంట మండలకేంద్రంతో పాటు కటారుపల్లి, మల్లమీదపల్లి, రెక్కమాను, ఎల్లుగూటివారిపల్లి, ద్వారనాల గ్రామాల్లో వీటి బెడద అధికంగా ఉంది. రోడ్లపై గుంపులుగా తిరుగుతూ ఒంటరిగా వెళ్లే వారిపై మూకుమ్మడిగా దాడికి దిగి గాయపరుస్తున్నాయి. ఇప్పటికే పలువురు చిన్నారులు, మహిళలు వీటి దాడిలో గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఇక రోడ్లపై ద్విచక్రవాహనాలకు అడ్డంగా రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయంలో ప్రధాన రోడ్లపైనే గుంపులుగా ఉండి వాహనాలపై వెళ్లే వారి వెంట పడుతున్నాయి. దీంతో వాటి నుంచి తప్పించుకునే క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాటి ధాటికి రోడ్లపైకి రావాలంటేనే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తాజాగా గత శుక్రవారం రాత్రి గొల్లపల్లిలో గొర్రెల మందలోకి కుక్కలు వెళ్లి 36 గొర్రెలను కరిచి చంపేసిన విషయం తెలిసిందే. ఏడాదికేడాదికి వాటి సంతానోత్పత్తి ఎక్కువై మందలుగా పెరిగిపోతున్నాయని, ఎక్కడ చూసినా గుంపులుగా అవే కన్పిస్తున్నాయని, ఆ కుక్కలను అదుపు చేయడంపై పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు.

వీధికుక్కల బెడద ఎక్కువైంది



వీధి కుక్కల బెడద ఎక్కువైంది. వలన ప్రమాదాలు, నష్టాలు చవి చూస్తున్నాం. అవి పెంపుడు కోళ్లను, మూగజీవాలను చంపేస్తున్నాయి. దీంతో నష్టాలను చవి చూస్తున్నాం. ఇక చిన్నారులు ఎక్కడైనా రోడ్లపై ఉంటే దాడులు చేస్తున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే వీధి కుక్కలను నివారించాలి.

-లోకేశ్వర్‌రెడ్డి, ఎల్లుగుట్టవారిపల్లి

గంగాభవాని అమ్మవారికి జ్యోతులు

గాండ్లపెంట, మే 19: మండలకేంద్రంలో గంగా భవానీ అమ్మవారి ఆలయ 16వార్షికోత్సవ వేడుకల సందర్భంగా గత మూడు రోజుల నుంచి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున అర్చకులు ఆలయం లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. మహిళలు పెద్దఎత్తున జ్యోతులు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు గ్రామంలో జ్యోతులను ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. కార్యక్రమానికి స్థానికులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం చేపట్టారు. ఉట్టి మాను ఎక్కడానికి యువత పోటీ పడ్డారు. చివరికి పలువురు ఉట్టి మాను ఎక్కి ఉట్టిని తీసుకురావడంతో ఉత్సవం ముగిసింది. గ్రామంలో గాజులు, ఆట బొమ్మలు, ఇతర సామగ్రి దుకాణాలు పెద్దఎత్తున వెలిశాయి. బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ కృష్ణవేణి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



అమ్మవారికి జ్యోతులు తీసుకెళ్తున్న మహిళలు



ఉట్లమాను ఎక్కడానికి పోటీ పడుతున్న యువకులు

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

- కంకర తేలి.. గుంతలు ఏర్పడిన వైనం
- ప్రయాణం నరకప్రాయమంటున్న ప్రజలు



గుంతలమయంగా ఉన్న గొట్లూరు నుంచి మల్కాపురానికి వెళ్లే రోడ్డు

ధర్మవరంరూరల్, మే19: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ప్రయాణం చేయాలంటే నరకప్రాయంగా ఉంది. దీంతో ఆ గ్రామాలప్రజలు, ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గొట్లూరు నుంచి మల్కాపురం గ్రామానికి వెళ్లే రహదారి కంకర తేలి అధ్వానంగా ఉంది. ఈ గ్రామాల నుంచి ధర్మవరానికి వాహనాల్లో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారని అంటున్నారు. సుమారు 2కిలోమీటర్ల మేర రోడ్డంతా కంకరతేలి తీవ్ర గుంతలమయంగా ఉందంటున్నారు. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని, గుంతల్లో వర్షం నీరు నిల్వ ఉంటుండడంతో లోతు తెలియక ప్రమాదాల భారిన పడే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి ఇలాంటి రోడ్లను బాగు చేయాలని వారు కోరుతున్నారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

- ఒకరి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు



అశోక్‌రెడ్డి (ఫైల్)

బత్తలపల్లి, మే19: మండలంలోని నల్లబోయనపల్లి వద్ద బైక్‌ను టిప్పర్ ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి గ్రామానికి చెందిన హనుమంతరెడ్డికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు అశోక్‌రెడ్డి (24) సంతానం. అశోక్‌రెడ్డి చెన్నయ్‌లో ప్రైవేటు కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. అయితే అతను ఆదివారం ఉదయం తన స్నేహితుడైన బత్తలపల్లి మండలం అప్రాచెరువు గ్రామానికి చెందిన విష్ణువర్దన్ బాబుతో కలిసి చెన్నయ్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ముదిగుబ్బ మండలం రాళ్లఅనంతపురం వెళ్లి తన అక్కను మాట్లాడించాడు. అనంతరం స్వగ్రామానికి వస్తుండగా బత్తలపల్లి మండలం నల్లబోయనపల్లి క్రాస్ వద్ద ఎదురుగా రాంగ్ రూట్‌లో ఇసుక టిప్పర్ వచ్చి ఢీకొంది. ప్రమాదంలో అశోక్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా.. విష్ణువర్ధన్ బాబుకి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ సోమశేఖర్ తన సిబ్బందితో ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ధర్మవరం, మే 19: పట్టణంలోని టూటౌన్ పోలీసు స్టేషన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం మండలం పోతులనాగేపల్లి గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి తన ద్విచక్రవాహనంలో ఆదివారం పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ దుకాణం వద్దకు వచ్చాడు. అక్కడ పని ముగించుకుని వెళ్తుండగా వెనుకనుంచి మరో ఓ ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో వెంకట్రామిరెడ్డి వెంకట్రామిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి: ఎన్ఎస్‌యూఐ

ధర్మవరం, మే 19: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పట్టణంలో పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయని ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు రావులచెరువు సురేశ్ ఆరోపించారు. పట్టణంలోని ఎన్జీహోం ఆవరణలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభం గాకమునుపే పలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లను చేస్తున్నాయన్నారు. విద్యాశాఖ అధికారులు ఏమీ పట్టనట్లు ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా స్పందించి వాటిని అరికట్టాలన్నారు. లేనిపక్షంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు బండారు చైతన్య, నాయకులు పాల్గొన్నారు.

సచివాలయం సమీపంలో.. చెత్తాచెదారం

- అసౌకర్యానికి లోనవుతున్న ప్రజలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

ధర్మవరంరూరల్, మే19: మండలంలోని రేగాటిపల్లి గ్రామంలో గ్రామసచివాలయం సమీపంలో రోడ్డుపక్కనే చెత్తాచెదారం పేరుకుపోయింది. ఎస్సీకాలనీకి వెళ్లే ఆ రహదారిలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో అటుగా వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని చెత్తాచెదారమంతా తెచ్చి అక్కడ పారవేస్తున్నారు. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. సచివాలయానికి నిత్యం ఎందరో వస్తుంటారు. వారందరూ కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సమస్య పంచాయతీ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఆ దారిలో వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉందంటున్నారు. ఇప్పటికైనా స్పందించి చెత్తాచెదారాన్ని తొలగించాలని వారు కోరుతున్నారు.



పేరుకుపోయిన చెత్త

విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

రొద్దం, మే 19 : ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ధరలతో అందించే విత్తన వేరుశనగ కాయలకోసం సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రొద్దం ఆర్‌బీకే-1 అగ్రికల్చర్ అసిస్టెంట్ గోవిందప్ప ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. మండల పరిధిలోని ఆర్బీకే కేంద్రాల్లో సోమవారం నుంచి విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేయించుకుంటామన్నారు. కే-6రకం 30కిలోల బ్యాగు ధర రూ.1710కాగా 90కిలోలకు రూ.5130 చెల్లించాలన్నారు. కదిరి, లేపాక్షి 1812రకం 30కిలోల బ్యాగు ధర రూ.1566కాగా 90కిలోల విత్తన వేరుశనగకు రూ.4698చెల్లించాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీపోను మిగిలిన ధర నిర్ణయించిందన్నారు. అర్హులైన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే విత్తన పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

రూ.28.62 కోట్లు పంట నష్టపరిహారం

మడకశిర రూరల్, మే 19: నియోజకవర్గంలో గతేడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులకు సంబంధించి పంట నష్టపరిహారం కింద రూ.28.62 కోట్లు విడుదలైనట్లు వ్యవసాయశాఖ అధికారి తిమ్మప్ప ఆదివారం ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పంట నష్టపోయిన 47,505 మంది రైతులకుగాను రూ28.62 కోట్లు పరిహారం వారి ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. మడకశిర మండలంలో 9,145 మంది రైతుల రూ. 4069 హెక్టార్లకు రూ.5.75 కోట్లు జమైనట్లు తెలిపారు. అగళిలో 9,023మందికి 33,314 హెక్టార్లకు సంబంధించి రూ.4.33 కోట్లు, అమరాపురంలో7,066 మందికి 3,732 హెక్టార్లకు రూ.5.84 కోట్లు జమైందన్నారు. గుడిబండలో 11,484 మందికి 4,447 హెక్టార్లకు గాను రూ.6.55 కోట్లు, రొళ్ల మండలంలో 10,787 మంది రైతులకు 4114 హెక్టార్లకు రూ.6.13 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు.

89 శాతం కార్డులకు బియ్యం పంపిణీ: డీటీ

మడకశిర రూరల్, మే 19: మండలవ్యాప్తంగా చౌక దుకాణాల్లో 89.49 శాతం రేషన్ కార్డు లబ్ధి దారులకు బియ్యం పంపిణీచేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ హారతి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం 'బియ్యం పంపిణీతో సరి...!' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. డిప్యూటీ తహసీల్దార్ హారతి మాట్లడుతూ... మండలంలో 25,606 కార్డులున్నాయని, ఇప్పటి వరకు 22,914 కార్డులకు బియ్యం పంపిణీ చేసినట్లు తెలిపారు. చక్కెర స్టాక్ పాయింట్‌కు అలస్యంగా రావడంతో పంపిణీ చేయలేక పోయామని తెలిపారు. జూన్ నెల కోటాతో కలిపి పంపిణీ చేస్తామని డీటీ తెలిపారు.

హెచ్‌ఐవీపై అవగాహన

మడకశిరటౌన్, మే 19: హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారిపట్ల వివక్ష వీడాలని ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ అశ్వత్థనారాయణ అన్నారు. ఇంటర్నేషనల్ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా ఆదివారం ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎయిడ్స్ పట్ల అవగాహన పెంచుకుంటే నష్టం ఉండదని, ప్రతి ఒక్కరు ఎయిడ్స్ మహమ్మారిని పారదోలేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగా హన కల్పించారు. రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో ఐసీటీసీ బ్లడ్‌బ్యాంకు సిబ్బంది రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఫోర్డ్ ప్రాజెక్టు డైరెక్టర్ బద్రీష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనుకొండ రూరల్, మే 19: మండలంలోని గుట్టూరు సమీపంలో 44వ జాతీయరహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడినట్టు మండలంలోని కియ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ రంగడు తెలిపారు. చెన్నేకొత్తపల్లి మండలం వంటికొండ గ్రామానికి చెందిన కోట్ల అక్కులప్ప చర్మవ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. అతడు ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంలో పెనుకొండ నుంచి చర్మాలు వేసుకుని చెన్నేకొత్తపల్లి వైపు వెళ్తున్నాడు. గుట్టూరు సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కోట్ల అక్కులప్ప తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని 108 సాయంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సల నిమిత్తం మెరుగైన వైద్యంకోసం అనంతపురం తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


వ్యక్తికి పాముకాటు

గోరంట్ల, మే 19: మండలంలోని ఎం కొత్తపల్లికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి ఆదివారం పాముకాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. కొత్తపల్లికి చెందిన బావయ్య కుమారుడైన శ్రీనివాసులు ఇంటి ఎదుట కోళ్ల పెంపకానికి ఏర్పాటు చేసిన గూటిలో చేయి పెట్టగా చిన్నకట్లపాము కుడిచేయి చిటికెన వేలిపై కాటు వేసింది. అక్కడి వారు పామును చంపేశారు. అస్వస్థతకు గురైన అతడిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ ఉషా చికిత్సలు చేశారు. మెరుగైన వైద్యం కోసం ప్రయివేటు వాహనంలో హిందూపురం తరలించారు.

పిడుగు పడి గేదె మృతి

పెనుకొండ రూరల్, మే 19: మండలంలోని కోనాపురంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పిడుగుపడి శంకర్‌రెడ్డిఅనే పాడిరైతుకు చెందిన గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన రైతు శంకర్‌రెడ్డి వాముదొడ్డిలో గేదెలను కట్టేశాడు. అయితే ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం వచ్చింది. ఈ సందర్భంగా పిడుగుపడి గేదె మృతిచెందింది. దీంతో దాదాపు రూ.60వేలు నష్టం వాటిల్లిందని రైతు శంకర్‌రెడ్డి వాపోయాడు. ప్రభుత్వం స్పందించి ఆర్థికసాయం అందించాలని బాధిత రైతు కోరాడు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్లను చూపుతున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్

పెనుకొండ టౌన్(సోమందేపల్లి), మే 19: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు ఆదివారం సోమందేపల్లి మండలం చల్లాపల్లి వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పరిగి మండలం గణపతిపల్లి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి మూడు ట్రాక్టర్లను సీజ్‌చేసి, స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కలగానే... రొద్దం పీహెచ్‌సీ నిర్మాణం

- నాలుగేళ్లుగా నిలిచిపోయిన కొత్త భవనం పనులు
- శిథిలావస్థలో పాత భవనం, సిబ్బంది క్వార్టర్లు



పునాదుల వద్దే నిలిచిపోయిన నూతన భవన నిర్మాణ పనులు

రొద్దం, మే 19 : మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణ పనులు కలగానే మిగిలేనా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహిస్తున్న భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో 2020వ సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వం నూతన భవనానికి రూ. 1.5 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో అప్పటి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి శంకర్‌నారాయణ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కాంట్రాక్టర్ శ్రీనివాసులు రూ.25లక్షలతో పునాది పనులను పూర్తి చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.15లక్షలకు బిల్లు పెట్టడంతో ఆయన పనులను అర్ధంతరంగా ఆపేశారని ప్రజలు చర్చించు కుంటు న్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పనులు జరుగ లేదు. పునాదులపై కంపచెట్లు బాగా పెరిగిపోయాయి. అంతేగాకుండా పనులను అర్ధంతరంగా ఆపేయడంతో... భవన నిర్మాణం పనులు పూర్తిగా రద్దయినట్లు సమాచారం. దీంతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం కొత్త భవనాల నిర్మాణం రొద్దం మండల వాసులకు కలగా మిగిలిందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

శిథిలావస్థలో ఉద్యోగుల క్వార్టర్స్

రొద్దం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేసే సిబ్బంది కోసం 40ఏళ్ల కిందట నిర్మించిన క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉద్యోగులు స్థానికంగా ఉండి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వాటిని నిర్మించారు. చాలా ఏళ్ల గా మరమ్మతులు చేపట్టకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నారు. వర్షం వచ్చినప్పుడు కారుతున్నాయి. దీంతో సిబ్బంది ఆ క్వార్టర్లలో ఉండలేక హిందూపురం, పెనుకొండ తదితర ప్రాంతాలలో నివాసముంటున్నారు. ఆ నుంచి బస్సుల్లో వచ్చి వెళ్తున్నారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గదులు వర్షం వచ్చినప్పుడు తడుస్తోంది. విలువైన మందులు, వ్యాక్సిన్లకు భద్రత లేకుండా పోతోందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెద్దమంతూరు పీహెచ్‌సీ నిర్మాణానికి నిధులేవీ...?

రొద్దం మండల పరిధిలోని పెద్దమంతూరులో ప్రాథమిక ఆరోగ్యకేంద్రంగా ఏడాది కిందట కొత్తగా మంజూరైంది. ఇద్దరు వైద్యులు, ఎంపీహెచ్‌ఓ, సూపర్ వైజర్ పోస్టులు మంజూరయ్యాయి. రొప్పాల సమీపంలో స్థలం చూపించారు. నూతన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణ పనుల కు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా... నిర్మాణం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. పెద్దమంతూరు సమీప గ్రామ ప్రజలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మంజూరైందని ఎంతో సంబరపడ్డారు. అయితే నిధులు లేక కొత్త భవనాలు నిర్మించకపోవడంతో ప్రజలు వైద్య సిబ్బంది దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ప్రస్తుతం అరకొర సౌకర్యాలు ఉన్న పెద్దమం తూరు ఆరోగ్య ఉపకేంద్రంలోనే వైద్యులు రోగులకు చికిత్స అందిస్తున్నారు.

కట్టించేందుకు ఆర్డీటీ సిద్ధమా..?

పెద్దమంతూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కట్టించేందుకు ఆర్డీటీ కృషిచేస్తున్నట్లు సమాచారం. అయితే ఆర్డీటీకి వచ్చే విదేశీ విరాళాలకు కేంద్రం బ్రేక్ వేయడంతో... నిధులు రాక ఆ సంస్థ వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం. అలాగే ప్రభుత్వం నిధులు మంజూరు చేయక తాత్సారం చేయడంతో ఆరోగ్యకేంద్రం పనులు జరగలేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జూన్‌నెలలో కొలువదీరే కొత్త ప్రభుత్వమైనా రెండు చోట్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను కట్టించి ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



వర్షానికి కారుతున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం



శిథిలావస్థలో ప్రభుత్వ క్వార్టర్స్

గోరంట్లలో కర్ణాటక పోలీసుల దాడులు

ముగ్గురిని అదుపులోకి తీసుకుని, ఆటో, బైక్ స్వాధీనం





ఆటో, బైక్‌ను పట్టుకుంటున్న కర్ణాటక పోలీసులు

గోరంట్ల, మే 19: పట్టణంలోని ప్రధాన రహదారిపై స్టేట్ బ్యాంక్ వద్ద ఆదివారం కర్ణాటక పోలీసులు ఆటో, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకోడంతో పాటు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మఫ్టీ దుస్తుల్లో, ఎర్రరంగుకారులో వచ్చిన కర్ణాటక పోలీసులు గోరంట్లలోని బ్యాంక్ వద్ద నెంబర్ ప్లేట్లు లేని ఆటో, డియో స్కూటీని దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. జనసంచారం అధికంగా ఉన్నప్రాంతంలో పోలీసులు దాడిచేసి పట్టుకోవడంతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. కర్ణాటక పోలీసుల వెంట స్థానిక పోలీసులు లేరు. దాడి తరువాత కూడా వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలి సింది. కర్ణాటకలో చోరీ అయిన ఆటో, స్కూటీని వెంబడిస్తూ వచ్చారని, వాటిని పట్టుకుని తీసుకెళ్లినట్లు సమాచారం. ఈవిషయంపై గోరంట్ల పోలీసులను విచారించగా, తమకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు సన్మానం



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న సంఘ్ పరివార్ సభ్యులు

హిందూపురం అర్బన్, మే 19: మనోబలం ముందు అంగవైకల్యం బలాదూర్ అని ఆర్‌ఎస్‌ఎస్ సంఘ చాలక్ హిమకర్ అన్నారు. హిందూపురానికి చెందిన ఎంకే శ్రీధర్ ఈ నెల 9వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సంఘ పరివార్ ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతను ఘనంగా సన్మానించారు. పట్టణ పరిధిలోని కంచికామాక్షి కల్యాణమండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో హిమకర్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్, రాధాకృష్ణ, రమాదేవి, గోవిందరాజులు, సంఘ్ పరివార్ నాయకులు పీడీ పార్థసారథి, రమేష్‌రెడ్డి, చారుకీర్తి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, మే 19: మండలంలోని వెలమకూరు గ్రామానికి చెందిన కొండారెడ్డి (70) ఆదివారం విషపుగుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడని రూరల్ పోలీసులు తెలిపారు. కొండారెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తిచెంది ఇంటిలో ఎవరూలేని సమయంలో విషపుగుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడి అరెస్ట్

గుంతకల్లుటౌన్, మే 19: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా ఆటోడ్రైవర్ అబ్దుల్లాను కత్తితో దాడి చేసిన కేసులో నిందితుడు షేక్ సికిందర్ బాషా అలియాస్ చాంద్‌బాషాను ఆదివారం అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ గణేష్ తెలిపారు. ఉదయం స్థానిక హనుమాన్ జంక్షన్ రైల్వే స్టేషన్ ముందర సికిందర్ అలియస్ చాంద్‌బాషను అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

బెళుగుప్ప, మే 19: మండలంలోని విరుపాపల్లిలో ఆదివారం విద్యుదాఘాతంతో చైతన్య (21) మృతిచెందింది. చైతన్య ఇంటి వద్ద దుస్తులు ఉతుకుతూ నీటి కోసం మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుత్ తీగలు తాకి షాక్ కొట్టింది. వెంటనే ఆమెను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె తల్లి రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

బెళుగుప్ప, మే 19: మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన ఏ వన్నూరుస్వామి (56) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. రెండేళ్ల క్రితం భార్య మృతి చెందడంతో జీర్ణించుకోలేక మనస్థాపానికి గురై శనివారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి అపస్మారకస్థితిలో వుండగా చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పశువుల సంతలో సుంకం దోపిడీ


- దళారుల అవతారమెత్తిన కొందరు ఉద్యోగులు
- ఆదాయం లక్షల్లో.. ఖజానాకు చూపేది వేలల్లో...
- ప్రభుత్వ ఆదాయానికి గండి



గుడిబండ పశువుల సంత (ఫైల్)

గుడిబండ, మే 19 : మండల కేంద్రంలో ప్రతివారం జరిగే పశువుల సంతలో సుంకం సొమ్ముతో కొంతమంది దళారులు జేబులు నింపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. గుడిబండ పశువుల సంతను గురు, శుక్రవారాల్లో నిర్వహిస్తున్నారు. ఈ పశువుల సంత సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను సుంకం వేలం గడువు ఈ సంవత్సరం మార్చి 31 తేదీ నాటికి ముగిసిపోయింది. దీంతో అధికారులు 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను ఈ సంవత్సరం ఫిబ్రవరి 22న పంచాయతీ అధికారులు వేలం వేశారు. ఈ వేలంపాటలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి రూ.80 లక్షలకు దక్కించుకున్నాడు. అతడు నిబంధనల మేరకు గడువులోగా నిధులను పంచాయతీ జమచేయలేదు. దీంతో పంచాయతీ అధికారులు తిరిగి మరోమారు వేలం నిర్వహించే పరిస్థితి నెలకొంది. అంతలోపే ఎన్నికల నోటిఫికే షన్ వెలువడటంతో వేలం నిలిపివేశారు. దీంతో ఏప్రిల్ నెల నుంచి పశువుల సంత సుంకాన్ని పంచాయతీ అధికారులే వసూలు చేస్తున్నారు. గుడి బండ పశువుల సంతకు గోరంట్ల, మడకశిరతో పాటు కర్ణాటకలోని మధుగిరి, శిర, పావగడ, చెళికెర తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు భారీఎత్తున పశువుల తీసుకొస్తున్నారు. అదేవిధంగా కేరళ నుంచి ఐదారు కంటెయినర్ల వాహనాలు పశువుల కొనుగోలుకు వస్తుంటాయి. వివిధ వాహనాల్లో పశువులను ఇక్కడికి తరలిస్తుంటారు. దీంతో గురు, శుక్రవారాల్లో నిర్వహిస్తుండటంతో గుడిబండ పశువుల సంత పెద్ద జాతరను తలపిస్తుంది. దీంతో కొందరు పంచాయతీ సిబ్బందే దళారుల వేషం ఎత్తారు. ఈ పశువుల సంతలో సుంకాన్ని వసూలు చేసుకుని జేబులు నింపుకుంటున్నారు. పశువుల సంతలో లక్షలాది రూపాయల సుంకం వసూలవుతున్నా వేల రూపాయలు చూపించి ప్రభుత్వ ఖజానాకు నామమాత్రంగా జమచేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పశువుల సంతలో భారీగా అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని బహిరంగంగానే ప్రజలు చర్చించుకుంటున్నారు. పశువుల సంతలో సుంకం ఎంత వసూలవుతోంది? ప్రభుత్వ ఖజానాకు ఎంత జమచేస్తున్నారు? అనే విషయాలను విచారించే నాథుడు లేరని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు చొరవతీసుకుని గుడిబండ పశువుల సంతపై ప్రత్యేక దృష్టిసారించి కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని, సుంకం నిధులు పక్కదారి పట్టకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమాల విషయం తెలియదు..



గుడిబండలో ప్రతి గురు, శుక్రవారం జరిగే పశువుల సంతలో సుంకం నిధులు పక్కదారి పడుతున్న విషయం నాకు తెలియదు. పంచాయతీ అధికారులు ప్రతి వారం వసూలు చేస్తున్న నిధులను ప్రభుత్వ ఖజానాకు జమచేస్తున్నారు. అయితే ఎంత వసూలు చేస్తున్నారో విచారిస్తాం. ఈ విషయాన్ని ఉన్నతాధి కారులకు తెలియజేస్తాం. సుంకం నిధులు పక్కదారి పట్టినట్లయితే అలాంటివారిపై చర్యలు తీసుకుంటాం.

- నాగరాజునాయక్, ఈఓఆర్డీ, గుడిబండ

వర్షంతో రైతుల్లో హర్షం



మడకశిరలో కురుస్తున్న వర్షం

మడకశిరటౌన్, మే 19: నియోజకవర్గ వ్యాప్తంగా మూడు రోజులుగా ఓ మోస్తారు వర్షం కురుస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగు కోసం సిద్ధమవుతున్నారు. అమరాపురం మండలం లో శనివారం రాత్రి 39.8 మి.మీ., రొళ్ల మండలంలో 11.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. అదేవిధంగా మడకశిర, గుడిబండ, అగళి మండలాల్లో సైతం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు ఖరీఫ్ సాగు కోసం పొలాగు దుక్కి దున్నే పనుల్లో నిమగ్నమవుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలను రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ అధికారి తిమ్మప్ప తెలిపారు. ప్రతి రైతు భరోసా కేంద్రానికి వంద క్వింటాళ్ల చొప్పన విత్తన కాయలు కేటాయించినట్లు తెలిపారు. రైతులకు అవసరమైన విత్తన కాయలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా కంది విత్తనాలను సైతం ప్రతి మండలానికి 50 క్వింటాళ్ల చొప్పున కేటాయించారన్నారు. సబ్సిడీ విత్తన కాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆదివారం సాయంత్రం కూడా మడకశిరలో వర్షం కురిసింది.

గుడిబండ: మండలంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. మండలంలోని ఎస్ రాయాపురం, పూజారిపల్లి, మేకల గట్ట, ఎస్ఎస్ గుండ్లు తదితర గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. చిన్న చిన్న వంకలు, వాగులు, ప్రవహించాయి. దీంతో గుంతలు, చెక్‌డ్యామ్‌లు నిండాయి. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిలమత్తూరు: మండలవ్యాప్తంగా శనివారం రాత్రి 10.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. వారం రోజులుగా విపరీతమైన ఉష్ణోగ్రతలు నమోదైన వేళ వరుణదేవుడు కరుణించడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. మండలంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి కూడా వర్షం భారీగా కురవడంతో రైతన్నల్లో ఆనందం వెల్లువెరిసింది. ఖరీఫ్‌లో పంటల సాగుకు అనుకూలంగా వర్షం కురిసిందని, పొలాలను దుక్కి చేసుకోవడానికి అవకాశం ఏర్పడిందని రైతులు పేర్కొన్నారు. ఈ వేసివిలో భూగర్భ జలాలు అడుగంటి చాలా బోరుబావుల నుంచి నీరు రావడంలేదు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో బోరుబావులు రీచార్జ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని రైతులు అంటున్నారు. ఏది ఏమైనా ఖరీఫ్ ప్రారంభంలో వరుణ దేవుడు కరుణించడంతో రైతుల్లో సంతోషం కనిపిస్తోంది.

'కార్మికులను సంఘటితం చేసిన పుచ్చలపల్లి'



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

హిందూపురం, మే 19 : వ్యవసాయ కార్మికులను సంఘటితం చేసిన నేత పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం మండల కార్యదర్శి రమేష్ ఆ పార్టీ కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని సీఐటీయూ నాయకులు ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ... దక్షిణ భారత కమ్యూనిస్ట్ పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం కమిటీ సభ్యులు బాబావలి, తిప్పన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

చెస్‌తో మెదడుకు పదును



చెస్ పోటీలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు

హిందూపురం అర్బన్, మే 19: మెదడును పదును పెట్టే ఆట చెస్ అని స్టార్టప్ చెస్ అకాడమీ జిల్లా కార్యదర్శి నాగార్జున పేర్కొన్నారు. స్థానిక మేళాపురం చెస్ అకాడమిలో ఆదివారం జిల్లాస్థాయి మహిళా చెస్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇలాంటి క్రీడలతో విద్యార్థులు చురుగ్గా ఉంటారన్నారు. ఈ పోటీల్లో 20 మంది పాల్గొనగా జ్ఞాపికారెడ్డి మొదటి స్థానంలో నిలిచింది. మోక్షిత రెండు, సహస్ర మూడు, భవ్య నాలుగవ స్థానంలో నిలిచారు. ఓపెన్ చెస్ విభాగంలో రఘునందన్‌కు మొదటిస్థానం, విష్ణు కిరణ్ రెండు, హర్ష మూడు, పెద్దన్న నాలుగోస్థానంలో నిలిచారన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడా కారులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో చెస్ కోచ్ ఆరీఫుల్లా, చీఫ్ ఆర్బీటర్ శివ, కృష్ణ తదితరులు ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

- ఒకరి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు



అశోక్‌రెడ్డి (ఫైల్)

బత్తలపల్లి, మే19: మండలంలోని నల్ల బోయనపల్లి వద్ద బైక్‌ను టిప్పర్ ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు.. చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండి గ్రామానికి చెందిన హనుమంతరెడ్డికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు అశోక్‌రెడ్డి (24) సంతానం. అశోక్‌రెడ్డి చెన్నయ్‌లో ప్రైవేటు కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. అయితే అతను ఆదివారం ఉదయం తన స్నేహితుడైన బత్తలపల్లి మండలం అప్రాచెరువు గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ బాబుతో కలిసి చెన్నయ్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ముదిగుబ్బ మండలం రాళ్లఅనంతపురం వెళ్లి తన అక్కను మాట్లాడించాడు. అనంతరం స్వగ్రామానికి వస్తుండగా బత్తలపల్లి మండలం నల్లబోయనపల్లి క్రాస్ వద్ద ఎదురుగా రాంగ్ రూట్‌లో ఇసుక టిప్పర్ వచ్చి ఢీకొంది. ప్రమాదంలో అశోక్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా.. విష్ణువర్ధన్ బాబుకి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన విష్ణువర్ధన్‌ను స్థానికులు ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఎస్‌ఐ సోమశేఖర్ తన సిబ్బందితో ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ధర్మవరం, మే 19: పట్టణంలోని టూటౌన్ పోలీసు స్టేషన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరం మండలం పోతులనాగేపల్లి గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి తన ద్విచక్రవాహనంలో ఆదివారం పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ దుకాణం వద్దకు వచ్చాడు. అక్కడ పని ముగించుకుని వెళ్తుండగా వెనుకనుంచి మరో ఓ ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో వెంకట్రామిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.